క్లుప్తంగా

నేడు ఆలయ శిఖర ప్రతిష్ట

కడప కల్చరల్ : కడప నగరం 44వ డివిజన్ బాలాజీనగర్‌లో సోమవారం శ్రీ సీతారామ లక్ష్మణ ఆంజనేయ నవగ్రహ శికర ప్రతిష్ఠ ఉత్సవం నిర్వహించనున్నామని డివిజన్ కార్పొరేటర్ రామకృష్ణారెడ్డి, హేమలతలు తెలిపారు. ఈ ఉత్సవానికి కడప ఎంపీ ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి పాల్గొంటారని తెలిపారు.

పార్టీ బలోపేతానికి కృషి



బసవరాజును సత్కరిస్తున్న నాయకులు

కడపకార్పొరేషన్ : వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బసవరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులైన బసవరాజును కడప నగరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న వైఎస్సార్‌సీపీ మైనార్టీ నేత సుబాన్ బాషా కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా సుబాన్ భాషా మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో బసవరాజు ఎంతో శ్రమించారని కొనియాడారు. కార్పొరేటర్లు షంషీర్ , గౌస్ బాషా (చాక్లెట్) పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ అర్జున్ కుమార్

కడప ఎడ్యుకేషన్: కడప పెద్దదర్గా సమీపంలోని పర్వీస్ హైస్కూల్లో ఆదివారం అర్జున్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. అర్జున్ హాస్పిటల్ అధినేత డాక్టర్ అవ్వారు అర్జున్ కుమార్ పర్యవేక్షణలో ఆయన సతీమణి ప్రముఖ వైద్యురాలు డాక్టర్ శిరీష రాటాల, డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ ఆనంద్ వైద్య సేవలందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అర్జున్ కుమార్ మాట్లాడుతూ తమ ఆసుపత్రిలో అన్ని ఎమర్జెన్సీ కేసులకు చికిత్స అందిస్తామని తెలిపారు. ఆసుపత్రి ప్రారంభం సందర్భంగా 3 నెలల వరకు అన్ని చికిత్సల బిల్లుపై 50 శాతం రాయితీ కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

బాలలపైనే భావి సమాజం

కడప కల్చరల్ : నేటి బాలల సంక్షేమంపైనే భావి భారత సమాజం ఆధారపడి ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం కడప నగరానికి చెందిన బాసట చిల్డ్రన్ హోం తొలి వార్షికోత్సవం నిర్వహించారు. బాసట స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని సంస్థ అధ్యక్షుడు మేరువ బాలాజీరావు ఏర్పాటు చేశారు. అయ్యప్ప కీర్తిక్‌రెడ్డి, స్థానిక ప్రముఖులు దేసు వెంకటరెడ్డి, అమర్‌నాథరెడ్డిపాల్గొన్నారు.

పుష్పగిరికి బస్సులు నడపాలి

కడప కల్చరల్ : జిల్లాలోని ప్రముఖ శైవక్షేత్రమైన పుష్పగిరికి శివరాత్రి పురస్కరించుకుని ఆర్టీసీ బస్సులు నడపాలని శ్రీ పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మ పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సట్టి భారవి కోరారు. ఈ క్షేత్రానికి ఆర్టీసీ కడప, మైదుకూరు డిపోల నుంచి భక్తుల సౌకర్యార్థం బస్సులు అందుబాటులో ఉంచాలని కోరారు.

ప్రజా సమస్యలపై పోరాడాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఆంధ్రప్రదేశ్ శాసన సభ, శాసన మండలి సెషన్లు ప్రారంభమవుతున్నాయనని, ఈ సెషన్లలో ప్రజా సమస్యలపై పోరాడాలని డీసీసీ అధ్యక్షురాలు విజయజ్యోతి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ అసెంబ్లీ, మండలిలో రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ఎజెండాగా చర్చించాలని సూచించారు.

భిన్నత్వంలో ఏకత్వం దేశం గొప్పతనం

కడప ఎడ్యుకేషన్: భిన్నత్వంలో ఏకత్వం భారతదేశం గొప్పతనం అని జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు లయన్ పటాన్ ఖాదర్‌బాషా అన్నారు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన మల్లం అఘోరిబాబా ఉత్తరాఖండ్ నుంచి కన్యాకుమారి వరకు శాంతి యాత్ర చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం బాబా కడపకు వచ్చిన సందర్భంగా పటాన్ ఖాదర్‌బాషాతోపాటు ముస్లిం నాయకుడు అమానుల్లా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు.

గ్రూప్ -2 మెయిన్ పరీక్ష రద్దు చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : గ్రూప్- 2 మెయిన్ పరీక్షను తక్షణం రద్దు చేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బండి సుమంత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రూప్-2 పరీక్షలను రోస్టర్ విధానంలో లోపాలు ఉన్నప్పటికీ, అభ్యర్థుల న్యాయమైన డిమాండ్లను పట్టించ గా గ్రూప్-2 అభ్యర్థులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారని తెలిపారు.

హర హర మహాదేవ శంభో!

ఘనంగా బోళా శంకరుడి మహా శోభయాత్ర



శోభయాత్రలో కొలువుదీరిన మహా శివుడు

కడప కల్చరల్: నగరంలోని మృత్యుంజయకుంటలోగల శ్రీ మృత్యుంజయశ్వర స్వామి ఆలయం వద్ద నుంచి మహదేవుని మహా శోభాయాత్ర ఆదివారం కనుల పండువగా సాగింది. త్రివేణి సంగమమైన పవిత్ర గంగా నదిలో స్నానమాచరించేందుకు వెళ్లలేకపోయిన భక్తులపై గంగా జలాన్ని సంప్రోక్షణ చేసి పునీతులను చేయడానికి స్థానిక భక్తులు ఈ శోభాయాత్రను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉదయం శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అర్చకులు చంద్రమౌళీశ్వర శర్మ, శ్రీధర్ శర్మ బృందం ఆధ్వర్యంలో శివయ్య వాహనం నగరంలో శోభాయాత్రకు బయలుదేరింది.

ఆకట్టుకున్న విన్యాసాలు

గుర్రాలు, గంగిరెద్దులు ముందునడుస్తుండగా భక్తులు కోలాటాల మధ్య కేరళ వాయిద్య బృందాల సందడితో యాత్ర నగరంలో కనుల పండువగా సాగింది. నాగ సాధువుల, శివ భక్తుల వేషధారణలో చేసిన విన్యాసాలు నగరవాసులను ఆకట్టుకున్నాయి. ప్రయాగలోని గంగా నది నుంచి సేకరించిన త్రివేణి సంగమ పవిత్ర జలాలను సాయి సేవకులు అడుగడుగునా నగరవాసులపై చల్లు తుండగా వారు తన్మయులై శివయ్యను మొక్క కున్నారు. స్థానిక సేవకులు, భక్తుల బృందాలు యాత్రలోని సేవకులకు నగర కూడళ్లలో అల్పాహారం, మంచి నీరు అందించారు. నగరంలోని దాదాపు 20 కూడళ్ల ద్వారా శోభాయాత్ర అత్యంత వైభవోపేతంగా సాగింది.

సమాజానికి అద్దం 'కొలకలూరి' నవలలు



రమేష్‌బాబును సత్కరిస్తున్న సీపీ బ్రౌన్ కేంద్రం సిబ్బంది

కడప కల్చరల్ : ఆధునిక సమాజంలోని సమస్యలకు ఆచార్య కొలకలూరి ఇనాక్ నవలలు అద్దం పట్టేలా ఉంటాయని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థి జి.రమేష్ బాబు అన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం నిర్వహిస్తున్న 'నెల నెలా సీమ సాహిత్యం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం బ్రౌన్‌శాస్త్రి సమావేశ మందిరంలో 141 వ సదస్సు నిర్వహించారు. బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇనాక్ నవలలకు సమకాలీన సమాజానికి మధ్య సంబంధాలేమిటో, ఆయన నవలల్లో ఎలాంటి జన జీవనం ఉందో ఈ సదస్సుల ద్వారా చర్చకు వస్తాయన్నారు. ప్రధానవక్త రమేష్ బాబు మాట్లాడుతూ ఇనాక్ నవలలు జ్ఞానపీఠం స్థాయికి తగినవని పేర్కొన్నారు. సభను డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి పర్యవేక్షించారు. వక్త రమేష్‌బాబును బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి, గ్రంథాలయ సహాయకులు ఎస్.రమేశ్‌రావు, జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బందితోకలిసి సత్కరించారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాయే లక్ష్యం

కడప కార్పొరేషన్: కడప నగరంలో విద్యుత్ అంతరాయాలు లేని నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యమని విద్యుత్ శాఖ కడప ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ హరి సేవ్యానాయక్ అన్నారు. శనివారం రాత్రి ఎల్ఐసీ విద్యుత్ ఉప కేంద్రంలో లోడ్ పెంచుటలో భాగంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను విజయవంతంగా ఏర్పాటు చేశారు. హరిసేవ్యానాయక్ మాట్లాడుతూ ప్రకాష్ నగర్, ఆర్‌టీసీ బస్‌స్టాండ్, రైల్వేస్టేషన్, కొత్త కలెక్టరేట్ పరిసర ప్రాంతాలు, ఎర్రముక్క పల్లి, గాంధీ నగర్ ప్రాంతాల్లో నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు.



సిబ్బందితో ఈఈ హరిసేవ్యానాయక్

గంగమ్మ జాతరకు ప్రత్యేక సర్వీసులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 26వ తేదీన పొలతలకు, నిత్యపూజకోనతో పాటు లక్కిరెడ్డిపల్లె గంగమ్మ జాతరకు స్పెషల్ సర్వీసులు నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పెషల్ బస్సులు కడప ఆర్టీసీ, పాత బస్టాండ్ నుంచి నడుస్తాయని పేర్కొన్నారు. రద్దీకి అనుగుణంగా బస్సులు పెంచేందుకు ఏర్పాట్లు చేశామని వివరించారు. సోమవారం రోజున 2 బస్సులు పోలతలకు, మరో 2 బస్సులు నిత్య పూజకోనకు తిరుగుతాయని చెప్పారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలి

సంఘ గౌరవాధ్యక్షుడు జి. ఈశ్వరయ్య

కడప సెవెన్‌రోడ్స్ : అగ్రిగోల్డ్ కంపెనీ ఆర్థిక మోసాలకు బలైపోయిన లక్షలాదిమంది కస్టమర్లకు, ఏజెంట్లకు సత్వర న్యాయం అందించాలని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్లకు వినతి పత్రాలు సమర్పిస్తున్నట్లు అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు జి ఈశ్వరయ్య పేర్కొన్నారు. ఆదివారం సీపీఐ జిల్లా కార్యాలయంలో అసోసియేషన్ జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం సంస్థ అధ్యక్షుడు అబ్దుల్ ఖాదర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ అగ్రిగోల్డ్ యాజమాన్యం లక్షలాది మంది ఏజెంట్లు, కస్టమర్ల నుండి సేకరించిన వేల కోట్ల రూపాయల డిపాజిట్ లను తిరిగి ఇప్పించాలని ఏళ్ల తరబడి ఉద్యమిస్తున్నా ప్రభుత్వాలు పెడచెవిన పెడుతుండటం దారుణమన్నారు. చంద్రబాబు గత పరిపాలన కాలంలో వారి పరిశీలనలో ఉన్న అన్ని అంశాలను వెంటనే పరిష్కరించాలన్నారు. లక్ష లోపు డిపాజిట్ చేసిన చిన్న పొదుపుదారులకు తక్షణం చెల్లింపులకు తగిన ఏర్పాటు చేసి అత్యవసర వైద్యం ,విద్య, బిడ్డల పెళ్లి లాంటి అవసరాలను తీర్చేందుకు డిపాజిట్ దారులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలన్నారు. సమస్యల సాధన కోసం ఈనెల 24 న కలెక్టర్లకు ఇచ్చే వినతి పత్ర కార్యక్రమాల్లో బాధితులు పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో రామయ్య సుబ్బారావు, రాజశేఖర్, భాగ్యలక్ష్మి, రాజగోపాల్ రెడ్డి, నాగేశ్వరయ్య, ఖాదర్‌బాష, మధు, కృష్ణ గోవింద్, శీను, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమను విస్మరించడం అన్యాయం



మాట్లాడుతున్న ఆర్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్: రాయలసీమను విస్మరించడం అన్యాయమని, రాష్ట్ర బడ్జెట్లో జనాభా ప్రాతిపదికన 42% నిధులు సీమకు కేటాయించాలని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి కోరారు. ఆదివారం నగరంలోని ఆర్‌సీపీ కార్యాలయంలోఆయన మాట్లాడుతూ రాయలసీమ ప్రాంత పాలకులే రాయలసీమను నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. తన సొంత గడ్డను ఎండగట్టి, పొరుగు ప్రాంతాలకు అధిక నిధులు కేటాయించి ఆ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ఇప్పటికైనా ఉక్కు పరిశ్రమను త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ఆది నిమ్మాయపల్లె బ్యారేజ్‌ను నిర్మించాలని, ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయం కడపలోని ఉంచాలన్నారు. శ్రీశైలంలో కనీస నీటిమట్టాన్ని ఉండేలా చూడాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని గండికోట, బ్రహ్మం సాగర్, సర్వారాయ సాగర్ జలాశయాలకు పంట కాలువలను యుద్ధ ప్రాతిపదికన నిర్మించాలని కోరారు. కృష్ణానది యాజమాన్య బోర్డును కర్నూల్‌లో ఏర్పాటు చేయాలని, రాయలసీమ లోని ప్రతి జిల్లాకు ఒక సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, యూనివర్సిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీయూ రాష్ట్ర కార్యదర్శి సిద్ధరామయ్య, ఆర్‌సీపీ నగర కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె. సుమన్, ఉపాధ్యక్షుడు జి.సంపత్ కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మంత్రివర్గ సమావేశంలో ఆప్కాస్ రద్దు చేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారని వార్తలు రావడంతో ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. జిల్లాలో అన్ని శాఖల్లో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులంతా అసోసియేషన్ బలోపేతం చేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని ఔట్సోర్సింగ్ ఉద్యోగులు భవిష్యత్తులో ఏ సమస్య వచ్చినా ఎదుర్కొనేందుకు ఐకమత్యంతో పోరాడాలని పిలుపునిచ్చారు . కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగాంజనేయులు నాయకులు పాల్గొన్నారు.









అత్యాధునిక టెక్నాలజీతో మోకాలి కీళ్ల మార్పిడి సర్జరీలు



ఆపరేషన్ థియేటర్‌లో జహంగీర్‌బాషా

కడప కోటిరెడ్డిసర్కిల్ : అత్యాధునిక టెక్నాలజీతో మోకాలు, కీళ్ల మార్పిడి సర్జరీలను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు జేబీ హాస్పిటల్ ఎండీ జహంగీర్‌బాషా తెలిపారు. కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలో జేడీ హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని సౌకర్యాలతో నిర్మించిన తమ ఆస్పత్రి మూడవ సంవత్సరంలోకి అడుగిడుతోందన్నారు. ఇప్పటికే తాము 6,000 పైగా మోకాల మార్పిడి, మక్కి మార్పిడి, 200 పైగా కీళ్ల మార్పిడి ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించామని తెలిపారు. కీ హోల్ సర్జరీ అంటే ఆర్థోస్కోపీ సర్జరీని కడపలో మొట్టమొదటిసారిగా ప్రారంభించి ఇప్పటికే 2,000 పైగా ఆపరేషన్లు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. వీటి కోసము అత్యాధునిక టెక్నాలజీ అదునాతన ఆపరేషన్ థియేటర్లు, టెక్నీషియన్లు అహర్నిశలు పనిచేస్తున్నారని చెప్పారు. కీళ్ల, నడుము నొప్పికి నియో రుమటాలజీ ట్రీట్మెంట్ ని ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. రాయలసీమలోని మొట్టమొదటిసారిగా రీజనరేటివ్ ఆర్థోపెడిక్స్‌ని ప్రారంభించి ఆపరేషన్ లేకుండా మోకాలు నొప్పి భుజం నొప్పిని సరి చేస్తున్నామన్నారు. మోకాళ్ల మార్పిడిలో చీము పట్టకుండా డ్యూయల్ యాంటీబయోటిక్ టెక్నిక్‌ని కనుగొన్నామని, ఆపరేషన్ ఫెయిలైనా, చీము పట్టినా ఇలిజరోవ్ టెక్నిక్, ఎల్ఆర్ఎస్ టెక్నిక్ ద్వారా యాంటీబయాటిక్ నెయిలింగ్ టెక్నిక్ ద్వారా ఎముకలను తిరిగి అతికిస్తామని ఆయన తెలిపారు.

దేశానికి ఆర్థిక భద్రతను ఇచ్చేది ప్రభుత్వ రంగ సంస్థలే

కడప కల్చరల్ : భారతీయ బీమా మార్కెట్లోకి పూర్తిస్థాయి విదేశీ బీమా కంపెనీలను అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ ప్రతిపాదనలను నిరసిస్తూ ఉద్యోగ సంఘాలు చేపట్టిన సంతకాల సేకరణ జయప్రదమైంది. ఆదివారం ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప డివిజన్ ఆధ్వర్యంలో కడప ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్ ప్రాంగణంలో ఎల్‌ఐసీ సిబ్బంది నిర్వహించిన బ్యానర్‌పై సంతకాల సేకరణ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సంఘం జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులు అక్బర్ బాషా ఆధ్వర్యంలో రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ కార్యదర్శి రవిశంకర్ రెడ్డి, రాష్ట్ర పర్యాటకశాఖ రిటైర్డ్ డైరెక్టర్ గోపాల్, ప్రముఖ వైద్య నిపుణులు మహబూబ్ బాషా, వైవీయూనివర్సిటీ ప్రిన్సిపాల్ రఘునాథ్‌రెడ్డి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సామాజిక బాధ్యత ప్రదర్శిస్తున్న ఎల్ఐసీకి పోటీగా అమెరికాలో దివాలా తీసిన ఏఐజీ, గోల్డ్ మెన్ సాక్స్ లాంటి విదేశీ కంపెనీలను మన గడ్డపైకి అనుమతించాల్సిన అవసరం లేదన్నారు.

కేంద్రం ఆలోచన అప్రజాస్వామికం

ఎల్ఐసీ సంఘాల నేతలు రఘునాథ రెడ్డి, సుదీకర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ చట్ట సవరణ బిల్లును హడావిడిగా ఆమోదింప చేసుకొని బీమా రంగంలోకి 100శాతం ఏఫ్డీఐ అనుమతించాలన్న కేంద్ర ప్రభుత్వం ఆలోచన అప్రజాస్వామికమని అన్నారు. బ్యాంకింగ్ రంగ సంఘాల నేతలు నాగసుబ్బారెడ్డి, అజీజ్, లలిత, జగదీష్, ప్రసన్న మాట్లాడుతూ 2018 లో వచ్చిన ప్రపంచ ఆర్థిక సంక్షోభం నుంచి మన దేశాన్ని కాపాడింది ప్రభుత్వ రంగ సంస్థలేనన్న వాస్తవాన్ని కేంద్ర ప్రభుత్వం గుర్తు తెచ్చుకోవాన్నారు.ఎల్ఐసీ యూనియన్ నాయకులు అవధానం శ్రీనివాస్, శంకరరావు, కేసీఎస్ రాజు, కుమార్ పాల్గొన్నారు.

అవార్డు ప్రదానం

కడప కల్చరల్ : కడపకు చెందిన సీనియర్ హోమియో వైద్యులు ప్రొఫెసర్ శ్రీనివాసులు గడుగుకు ఆదివారం పూణెలో జాతీయ అవార్డు ప్రదానం చేశారు. ఆయన హైదరాబాదులోని హోమియోపతి కళాశాలలో సీనియర్ వైద్యులుగా పని చేస్తున్నారు.27వ జాతీయ ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి సదస్సు ఆదివారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా శ్రీనివాసులుకు మహారాష్ట్ర యూనివర్శిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ప్రొఫెసర్ వైస్ చాన్సలర్ అవార్డును ప్రదానం చేశారు.





ఇందిరాపై మంత్రి వ్యాఖ్యలు అమానుషం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధిపై రాజస్థాన్ మంత్రి అవినాష్ ఇటీవల అసెంబ్లీలో అమానుషంగా మాట్లాడటం బాధాకరమని పీసీసీ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అలీ ఖాన్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చట్టసభలో బీజేపీ మంత్రి మాట్లాడుతూ గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అమలు చేసిన ప్రతి పథకానికి వారి జేజమ్మ పేరు పెట్టుకున్నట్లు మాట్లాడారని తెలిపారు. ఈ వ్యాఖ్యలపై అక్కడి కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు తీవ్ర అభ్యంతరాలు చెప్పారని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి ఇందిరా గాంధీ చేసిన సేవలు ప్రజలు ఇప్పటికీ మర్చిపోలేరన్నారు.





